## నాగలింగేశ్వరాలయంలో ఘనంగా చండీహోమం


నాగలింగేశ్వరాలయంలో చండీ హోమం నిర్వహిస్తున్న అర్చకులు

శంషాబాద్: దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని కాపుగడ్డ నాగలింగేశ్వరాలయంలో వైభవంగా పూజలు నిర్వహిస్తున్నారు. మంగళవారం చండీహోమం, గణపతి పూజ, నవగ్రహ పూజ, ప్రధాన కలశపూజ, లలిత సహస్రనామం, కుంకుమార్చన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని మహాలక్ష్మీ దేవిగా అలంకరించారు.

## బీజేపీ విజయోత్సవ సంబరాలు


సంబరాల్లో పాల్గొన్న బీజేపీ నాయకులు

మైలార్‌దేవ్‌పల్లి: హరియాణా రాష్ట్ర ఎన్నికల్లో మూడోసారి బీజేపీ పార్టీ విజయ ఢంకా మోగించడంతో మంగళవారం కాటేదాన్ బీజేపీ కార్యాలయంలో మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో బాణాసంచా కాల్చి విజయోత్సవ వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ..దేశంలో బీజేపీ తిరుగులేని శక్తిగా మారనున్నదన్నారు. తెలంగాణలోనూ కాషాయ జెండా ఎగరవేయడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు అడికె జనార్దన్ , రమేష్‌రెడ్డి, మల్లేష్ పాల్గొన్నారు.

## అన్ని రాష్ట్రాల్లో బీజేపీ విజయం ఖాయం


హైదర్‌గూడలోని బీజేపీ కార్యాలయంలో నేతల సంబరాలు

అత్తాపూర్: కేంద్రంలోని నరేంద్రమోదీ పాలన ఎంత గొప్పగా ఉందో ప్రజల తీర్పు చూస్తే అర్థమవుతుందని చేవెళ్ల పార్లమెంట్ బీజేపీ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి అన్నారు. హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించిన సందర్భంగా మంగళవారం హైదర్‌గూడ బీజేపీ కార్యాలయంలో అత్తాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు సాబాద విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నారగూడెం మల్లారెడ్డి మాట్లాడుతూ మహారాష్ట్ర, జార్ఖండ్, ఢిల్లీ సహా అన్ని రాష్ట్రాలలో జరుగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయకేతనం ఎగరవేయడం ఖాయమన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మోహింద్ర కొమురయ్య, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కాడెం సుధాకర్, జిల్లా ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు బీట్యాకరి సిద్దేశ్వర్, డివిజన్ ప్రధాన కార్యదర్శి రావుల జగన్, బూత్ అధ్యక్షులు బీట్యాకరి సతీష్, ఉమాశంకర్, గొల్ల అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## మధుబన్ కాలనీలో దొంగల హల్‌చల్


లారీ బ్యాటరీ ఎత్తుకెళ్తున్న దొంగ

మైలార్‌దేవ్‌పల్లి: మధుబన్ కాలనీలో దొంగలు రెచ్చిపోతున్నారు. తరచూ బైక్‌లు, లారీ బ్యాటరీలు ఎత్తుకెళ్తున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన కార్మికులు రాత్రి సమయంలో గంజాయి సేవిస్తూ దొరికింది దోచుకెళ్తున్నారని కాలనీవాసులు వాపోతున్నారు. పోలీసుల నిఘా లేకపోవడంతోనే వారు మరింత రెచ్చిపోతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం రాత్రి మధుబన్‌కాలనీలో ఉంటున్న నర్సింహకు చెందిన లారీ బ్యాటరీ చోరీ చేశారు. అలాగే అతడి ఇంటి ఎదుట నిలిపిన బైక్‌ను సైతం ఎత్తుకెళ్లారు. పోలీసులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని బాధితుడు వాపోయాడు. ఇప్పటికైనా పోలీసులు గస్తీ ముమ్మరం చేసి దొంగతనాలకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు పోలీసులను కోరుతున్నారు.

## భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ వేగవంతం


సమావేశానికి హాజరైన తాపీ మేస్త్రీలు

గచ్చిబౌలి: మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్లతో పోల్చితే భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణాలు వేగంగా పూర్తవుతాయని భారతి సిమెంట్ టెక్నికల్ ఇంజనీర్ శివకుమార్ తెలిపారు. మంగళవారం రాత్రి కొండాపూర్‌లో మాదాపూర్ స్టీల్ హౌస్ డీలర్‌షిప్‌లో తాపీ మేస్త్రీల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్‌సెట్టింగ్ సిమెంట్ 5 స్టార్ గ్రేడ్‌ను తెలంగాణలో విడుదల చేసిందన్నారు. అల్ట్రాఫాస్ట్ పిల్లర్లు, స్లాబ్‌లు, బ్రిడ్జిలు, రహదారుల నిర్మాణానికి సరైన ఎంపిక అని ఆయన పేర్కొన్నారు. వినియోగదారులకు భారతి సిమెంట్ ఉచితంగా సాంకేతిక సహాయం అందిస్తుందని డీలర్ నర్సిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలోమార్కెటింగ్ అసిస్టెంట్ మేనేజర్ రాజేంద్రప్రసాద్, తాపీ మేస్త్రీలు పాల్గొన్నారు.

## లిఫ్ట్‌లకు మరమ్మతులు

డబుల్ ఇళ్లవాసుల హర్షం

శేరిలింగంపల్లి: గచ్చిబౌలి డివిజన్ నల్లగండ్లలోని డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయంలో ఎమ్మెల్యే గాంధీ చొరవతో నాలుగు లిఫ్ట్‌లకు మరమ్మతులు చేయడంపై కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. ఏడాది వరకు లిఫ్ట్ నిర్వహణ ఖర్చులు కూడా ప్రభుత్వమే భరిస్తుందని గాంధీ స్పష్టం చేశారు. గత కొన్ని రోజులుగా డబుల్ ఇళ్లవాసులు, ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇక్కట్లు పడ్డారని ఆయన పేర్కొన్నారు.


లక్ష్మీదేవి అవతారంలో కోట మైసమ్మ


గ్రీన్ సిటీ పోచమ్మ దేవాలయంలో..


కట్ట మైసమ్మ దేవాలయంలో...

# భక్తి శ్రద్ధలతో నవరాత్రి ఉత్సవాలు


వీరాంజనేయ భక్త సమాజం ఆధ్వర్యంలో..

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలో ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలోని దేవాలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. ఉదయం నుండి రాత్రి వరకు దేవాలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. మంగళవారం అమ్మవారిని లక్ష్మీదేవి రూపంలో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. బుద్వేల్ గ్రీన్‌సిటీలోని పోచమ్మ దేవాలయంలో మంగళవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. ఉదయం అమ్మవారికి అభిషేకం చేశారు. అమ్మవారిని లక్ష్మీదేవిగా అలంకరించారు. – రాజేంద్రనగర్ జోన్ బృందం


అమ్మవారికి మహా హారతి ఇస్తున్న భక్తులు


బుద్వేల్ రైల్వేస్టేషన్ ప్రాంతంలో అమ్మవారిని దర్శించుకున్న నాయకులు


మణికొండ శివాజీనగర్‌లో..


పుప్పాలగూడలో కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు


అన్నదానంలో పాల్గొన్న భక్తులు

## కాంగ్రెస్ సీనియర్ నేత సతీష్ కుమార్ మృతి


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గుండాడ సతీష్‌కుమార్ మంగళవారం కన్నుమూశారు. గత కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ సతీష్ మృతేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## మౌలిక వసతులు కల్పిస్తాం

రాయదుర్గం: నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరిస్తామని ఎమ్మెల్యే గాంధీ స్పష్టం చేశారు. సీసీ రోడ్లు మంజూరు చేసిన నేపథ్యంలో గచ్చిబౌలి డివిజన్ అవంతిక హోమ్స్ కాలనీవాసులు మంగళవారం ఎమ్మెల్యే గాంధీని కలిసి సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాలనీలు ,బస్తీలలో పూర్తిస్థాయి మౌలిక వసతులను కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు మంత్రి ప్రగడ సత్యనారాయణ, వేణుగోపాల్‌రెడ్డి, సురేష్ నాయక్, శ్రీనివాస్, పింటు, రాకేష్, రాజేందర్, కిరణ్‌కుమార్, కాలనీవాసులు పాల్గొన్నారు.

## అడ్డుగోడను తొలగించండి

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలోని శివరాంపల్లి ఓల్డ్ వీకర్ సెక్షన్ కాలనీలో హార్టికల్చర్ యూనివర్సిటీ ప్రహరీ సమీపంలో ఉన్న పురాతన శివాలయంలో యూనివర్సిటీ అధికారులు పూజా కార్యక్రమాలు నిర్వహించకుండా, ఎవరూ లోపలికి రాకుండా అడ్డుగా ప్రహరీ నిర్మించారు. స్థానికుల ద్వారా ఈ విషయం తెలుసుకున్న బీజేపీ నాయకులు మంగళవారం అక్కడికి చేరుకున్నారు. వెంటనే అక్రమంగా నిర్మించిన గోడను తొలగించాలన్నారు. ఎన్నో ఏళ్లుగా పూజలు చేస్తున్న శివాలయానికి ఎవరూ గోడ నిర్మించడం దారుణమన్నారు. వెంటనే గోడను కూల్చివేసి వీకర్ సెక్షన్ కాలనీ ప్రజలు నిత్యం పూజలు చేసుకునేలా గేటు ఏర్పాటు చేయాలని యూనివర్సిటీ రిజిస్ట్రర్‌ను కోరారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందిస్తూ ఉన్నతాధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కంటెస్టెడ్ ఎమ్మెల్యే తోకల శ్రీనివాస్ రెడ్డి, వై.శ్రీధర్, బొక్క బాల్‌రెడ్డి, జి.బాబురావు, మల్లేష్ యాదవ్, డి.సత్యనారాయణ ముదిరాజ్, జోగి రవి, బండారి బాలకృష్ణ, సందీప్ ముదిరాజ్, విజయ్ కుమార్, సోల్కర్ రెడ్డి, పద్మావతి, రాకేశ్ గౌడ్, శ్రీనివాస్, రజనీకాంత్ గుప్తా, పవన్ రాజ్, మల్లేష్ చారి తదితరులు పాల్గొన్నారు.


పూజలకు అనుమతి ఇవ్వాలని రిజిస్ట్రార్‌ను కోరుతున్న ప్రజలు


## విద్యతోనే సమాజ అభివృద్ధి


కిస్మత్‌పూర్‌లో ఎంఈఓ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

బండ్లగూడ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యం ఇస్తుందని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. మంగళవారం బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కిస్మత్‌పూర్‌లో మండల విద్యా వనరుల కేంద్ర కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యాభివృద్ధితోనే సమాజం బాగుపడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ చదువుకునేలా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కొందరు తమ పిల్లలను బడుల్లో చేర్పించడం లేదని వారిని పనుల కోసం పంపిస్తున్నారన్నారు. అలాంటి వారిని గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా చూడాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యతో పాటు మధ్యాహ్న భోజనం, తదితర సౌకర్యాలను కల్పించడం జరుగుతుందన్నారు. ఉత్తమ ఉపాధ్యాయుల చేత విద్యాబుద్ధులు నేర్పించడం జరుగుతుందన్నారు. పాఠశాలల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరించేందుకు ఎప్పుడు సిద్ధంగా ఉంటానన్నారు. కార్యక్రమంలో మేయర్ లతా ప్రేమ్‌కుమార్‌గౌడ్, కార్పొరేటర్లు నిఖిలసంగారెడ్డి, అస్లాంబిన్ అబ్దుల్లా, సాగర్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ రాందాస్ ముదిరాజ్, మాజీ ఎంపీపీ తలారి మల్లేష్‌ముదిరాజ్, నాయకులు ప్రేమ్‌గౌడ్, గోకరి సురేష్‌గౌడ్, కృష్ణారెడ్డి, సంగారెడ్డి, నాయకులు, గ్రామస్తులు, పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## హోరాహోరీగా ఫ్రెండ్లీ పోలీస్ వాలీబాల్ పోటీలు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎస్సై, కౌన్సిలర్

మణికొండ: సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఫ్రెండ్లీ పోలీస్ క్రీడా పోటీలను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఖానాపూర్ గ్రామంలో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. గ్రామానికి చెందిన రెండు టీమ్‌లు, వట్టినాగులపల్లి నుంచి ఒకటి, అజీజ్‌నగర్ నుంచి మరో జట్టు పోటీల్లో పాల్గొన్నాయి. నాలుగు జట్ల మధ్య హోరాహోరీగా జరిగిన పోటీలో అజీజ్‌నగర్ జట్టు మొదటి స్థానంలో, వట్టినాగుపల్లి జట్టు రెండో స్థానంలో నిలిచాయి. అజీజ్‌నగర్‌కు చెందిన శేఖర్ బెస్ట్ ప్లేయర్‌గా ఎంపికయ్యారు. మొదటి స్థానంలో నిలిచిన అజీజ్‌నగర్ జట్టుకు రూ. 8వేలు, రెండో స్థానంలో నిలిచిన వట్టినాగులపల్లి జట్టుకు రూ. 5వేలు, ఉత్తమ ప్లేయర్‌కు రూ. 2వేల నగదు బహుమతులను సెక్టార్ ఎస్సై మురళీధర్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత క్రీడలను జీవితంలో భాగంగా చేసుకుని రాణించాలన్నారు. గ్రామాల్లో జరిగే సంఘటనలను పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. తల్లిదండ్రులకు, గ్రామాలకు మంచి పేరు తేవాలని సూచించారు. కార్యక్రమంలో ఖానాపూర్ కౌన్సిలర్ జి.అమరేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఆర్. నర్సింహ, క్రీడాకారులు, పోలీసులు పాల్గొన్నారు.

## ఎక్స్‌డీసీ నెట్‌వర్క్‌తో టీహబ్ ఒప్పందం

రాయదుర్గం: హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్ ప్రాంగణంలో ఎక్స్‌డీసీ నెట్‌వర్క్‌తో టీహబ్ మంగళవారం ఒక ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా భారత్‌లో వెబ్ 3 స్టార్టప్‌ల కోసం బ్లాక్ చెయిన్ ఇన్నోవేషన్‌ను వేగవంతం చేయనున్నారు. అంతకుముందు టీహబ్ సీఈఓ మహంకాళి శ్రీనివాసరావుతో ఎక్స్‌డీసీ నెట్‌వర్క్ వెంచర్, ఎకో సిస్టమ్ బిల్డింగ్ హెడ్ సోని మహంతి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ బ్లాక్ చెయిన్ టెక్నాలజీ పరిశ్రమలను విప్లవాత్మకంగా మార్చడానికి అపారమైన సామర్థ్యాన్ని కలిగి ఉందన్నారు. ఎక్స్‌డీసీ నెట్‌వర్క్‌తో మా భాగస్వామ్యం భారతీయ స్టార్టప్‌లకు కొత్త ఆవిష్కరణలు, గణనీయమైన మార్పును తీసుకురావడానికి అవసరమైన సాధనాలు, మద్దతును అందిస్తుందని చెప్పారు.

## డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి


పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: ప్రజలు డ్రైనేజీల్లో చెత్తచెదారం, వ్యర్థాలు వేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర అన్నారు. మంగళవారం ఆయన కార్పొరేషన్ పరిధిలోని 5వ డివిజన్‌లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ క్లీనింగ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి ఆయన పలు సూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ డ్రైనేజీలు నిండిపోకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎయిర్‌టెక్ మిషన్‌తో డ్రైనేజీ లైన్‌లను శుభ్రం చేస్తున్నామన్నారు. పేరుకుపోయిన మట్టిని తొలగించి డ్రైనేజీలు పొంగిపోర్లకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజలు సైతం డ్రైనేజీల్లో చెత్త, వ్యర్థాలను వేయరాదని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేష్, శానిటరీ జవాన్ సావిత్రి, యూజీడీ టీం అరుణ్, సంతోష్, గోపాల్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## మందుబాబుల వీరంగం

గచ్చిబౌలి: కొండాపూర్ శ్రీరాంనగర్ కాలనీలోని ఓ వైన్ షాపు ముందు మందుబాబులు వీరంగం సృష్టించారు. నడిరోడ్డుపై రాళ్లతో పరస్పరం దాడి చేసుకుంటుండడంతో వాహనదారులు భయాందోళన చెందారు. సమాచారం అందుకున్న గచ్చిబౌలి పోలీసులు ఘర్షణకు దిగిన వారి వివరాలు సేకరించారు. పోలీసుల రాకను పసిగట్టి అక్కడి నుంచి మందుబాబులు ఉడాయించారు. బొటానికల్ గార్డెన్‌ను ఆనుకొని ఉన్న వైన్ షాపు ఎదుట ఖాళీ ప్రదేశంలో మద్యం సేవిస్తున్నారు. నిత్యం మందుబాబుల గలాటాలతో అటుగా వెళ్లే పాదచారులు బిక్కుబిక్కుమంటూ వెళుతున్నారు.

## అమ్మవారు అందరినీ చల్లగా చూడాలి


మాట్లాడుతున్న మాజీమంత్రి సబితా ఇంద్రారెడ్డి


సబితా ఇంద్రారెడ్డికి స్వాగతం పలుకుతున్న మహిళలు

మైలార్‌దేవ్‌పల్లి: చాలా ఏళ్లతరువాత తన పుట్టింటికి వచ్చినట్లుగా ఉందని మాజీ మంత్రి మహేశ్వరం నియోజవర్గ ఎమ్మెల్యే పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి అన్నారు. సోమవారం రాత్రి బాబుల్‌రెడ్డినగర్ నవ దుర్గాయూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి పూజల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..గతంలో తనను , ఇంద్రారెడ్డిని ఈ కాలనీ వారు గౌరవించి గెలిపించారని, ఇప్పుడు తన కుమారుడు కార్తీక్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. అమ్మవారి ఆశీస్సులు తప్పకుండా అందరిపై ఉండాలని , అందరూ చల్లగా చూడాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ఎస్ వెంకటేష్ ,సోమ శ్రీనివాస్ గుప్త,డి రమేష్ ,రాముయాదవ్ ,కార్తీక్ ముదిరాజ్ శ్రీకాంత్ రెడ్డి, లక్ష్మిప్రసన్న, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా బతుకమ్మ సంబరాలు


తెలంగాణ పోలీస్ అకాడమీలో బతుకమ్మ ఉత్సవాల్లో డైరెక్టర్ అభిలాష బిస్త్

బండ్లగూడ: తెలంగాణ పోలీస్ అకాడమీలో మంగళవారం బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ ఉత్సవాలను ప్రారంభించారు. అకాడమీ సిబ్బంది, ట్రైనీ మహిళా కానిస్టేబుళ్లు తీరొక్క పూలతో బతుకమ్మలను తయారు చేసి తీసుకువచ్చారు. బతుకమ్మ పాటలకు అనుగుణంగా ఆడిపాడారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్లు నర్మద, సునీతామోహన్, ట్రైనీ మహిళా కానిస్టేబుళ్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యాన విశ్వవిద్యాలయంలో..

ఏజీవర్సిటీ: శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో మంగళవారం బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ ప్రశాంత్, కూరగాయల విభాగం ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ అనిత, అధ్యాపకులు నాగ హర్షిత, నిరోషా, సంతోషిని, మమత, లావణ్య, అశ్వన్‌కుమార్, శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.


నార్సింగి ప్రభుత్వ ఆసుపత్రి వద్ద..


కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో..